క్లుప్తంగా

బెల్టుషాపులకు సరఫరా చేస్తే లైసెన్సు రద్దు


మాట్లాడుతున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి: బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్సై ప్రేమ్ కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరికైనా బెల్టుషాపుల సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. రెస్టారెంట్‌లలో మద్యం అమ్మకాలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. మద్యం షాపు యజమానులు అధిక మొత్తంలో బాటిళ్లు బయటకు సరఫరా చేసినట్లు తేలితే మొదటి విడత జరిమానా విధిస్తామని, మళ్లీ పునరావృతమైతే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరణలో డీవైఎఫ్ఐ నాయకులు

కనిగిరి రూరల్: భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య(డీవైఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సుందరయ్య కాలనీలో డీవైఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పిచ్చయ్య మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య అంతం డీవైఎఫ్ఐ పంతంగా తెలిపారు. నిరుద్యోగ యువత సమస్యలపై నిరంతరం పోరాడేదే డీవైఎఫ్ఐ అని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.నరేంద్ర, నారాయణ, కాశయ్య, వలి, నవీన్, నెహమాత్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి పాండు రంగరావు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు


టంగుటూరు: పిల్లలు విధిగా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులతో చదవడం మాకిష్టం లాంటివి పిల్లల్లో సృజనాత్మకత పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

చదవడం అలవాటు చేసుకోవాలి


చాకిచర్లలో చదువుతున్న విద్యార్థులు

ఉలవపాడు: విద్యార్థులు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. ఉలవపాడులోని శాఖా గ్రంథాలయం, చాకిచర్లలోని బుక్ డిపాజిట్ సెంటర్లలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను చదివి తమ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో నీతికథలు, మహనీయుల చరిత్రలు చదివించారు.

33 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణ మోహన్

కొండపి: మండలంలోని కట్టావారిపాలెంలో మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 33 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఒంగోలు దేవి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కంకణాల కృష్ణ మోహన్, ఆస్పత్రి సిబ్బంది శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సుగర్, బీపీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయవద్దన్నారు. ధ్యానం, యోగా వంటివి సాధన చేస్తూ ప్రశాంత జీవనం అలవాటు చేసకోవాలన్నారు. గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ల చెంచయ్య, వీరమోసు మస్తానావు, మానికొండ వెంకటేశ్వర్లు, గుంటుపల్లి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


కట్టవారిపాలెం నేతివారిపాలెం గ్రామాల మధ్య తారు రోడ్డుపై ఏర్పడిన గుంత


కొండపి అనకర్లపూడి గ్రామాల మధ్య ఏర్పడిన గుంత

రోడ్లు ఇలా..ప్రయాణం ఎలా..?

- అధ్వానంగా రోడ్లు
- పట్టించుకోని అధికారులు

కొండపి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మండల పరిధిలోని కట్టవారిపాలెం, నేతివారిపాలెం గ్రామాల మధ్య, కొండపి అనకర్లపూడి గ్రామాల మధ్య, కొండపి నుంచి పొదిలి వెళ్లే రహదారిలో పెట్లూరు గ్రామం వద్ద రోడ్లు గుంతల మయంగా తయారయ్యాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రిళ్లు అయితే ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని సమయాల్లో గోతులు కనిపించక ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. రోడ్డుపై పడిన గుంతలకు తాత్కాలికంగానైనా మరమ్మతులు చేసి ప్రయాణికుల ఇక్కట్లు తీర్చాల్సిన అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఈ రహదారుల్లో నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు, బస్సుల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై తారు, కంకర లేచి గుంతలుగా మారాయి. కొన్ని రహదారులు శిథిలావస్థకు చేరి అధ్వానంగా మారడంతో ప్రయాణం చేయాలంటే నరకాన్ని తలపిస్తోందని వాపోతున్నారు. గుంతలు పడిన ప్రాంతాల్లో తాత్కాలికంగా మట్టి, కంకర వేసి మరమ్మతులు చేసినా కొన్ని రోజులు సరి పోతుందని, కానీ అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేసి ప్రయాణం సాఫీగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


పెట్లూరు చెరువు కట్ట సమీపంలో రహదారిపై పడిన భారీ గుంతలు


పెట్లూరు వద్ద రోడ్డుపై లేచిన తారు

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు


ప్రతిజ్ఞలో యూటీఎఫ్ నాయకులు


పాల్గొన్న ఉపాధ్యాయులు

కనిగిరి రూరల్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ వేడుకలు, మండల కౌన్సిల్ సమావేశాలు ఆదివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జరిగిన మహాసభల్లో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారంలో యూటీఎఫ్ కృషిని కొనియాడారు. యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, వి.మాలకొండారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు సాగిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, యూటీఎఫ్ నాయకులు ఎం రాము, ఎస్‌కే ఖాజా రంతుల్లా, పట్నం నరసింహులు, చిన్నస్వామి, రుషేంద్ర, అన్ని మండలాల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. డివిజన్ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు యువీ నారాయణరెడ్డి, రాజాల కొండారెడ్డి, జి.సంజీవి, ఆర్ శ్రీనివాసరావు, ఎన్జీఓ అధ్యక్షుడు పిల్లి వెంకట రమణారెడ్డి, విశ్రాంత ఎంఈఓ నాగిరెడ్డి, ఖాజా హుస్సేన్, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు(కేవీ), ఎం బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కనిగిరి, హెచ్ఎంపాడు, పీసీపల్లి, వెలిగండ్ల మండలాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కనిగిరి మండల అధ్యక్షునిగా బి.మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా పి.నరసింహం, కోశాధికారిగా కేవీ బాలకృష్ణ, వెలిగండ్ల మండల అధ్యక్ష, కార్యదర్శులుగా టీవీ సుబ్బారెడ్డి, బి. మాల్యాద్రి, హెచ్ఎంపాడు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్‌కే జిలానీ, ఎం బ్రహ్మయ్య, పీసీపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా రమేష్, ఏసుబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంటుందని సంఘ జిల్లా అధ్యక్షుడు ఓ.వీరారెడ్డి, యూటీఎఫ్ మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారిశెట్టి వెంకట రామయ్య, షేక్ పాదుషా అన్నారు. స్థానిక వడ్డెపాలెం పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ, కౌన్సిల్ సమావేశం, మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నారిశెట్టి వెంకటరామయ్య, షేక్‌పాదుషా, గౌరవ అధ్యక్షునిగా జి.వేమనారాయణ, సహాధ్యక్షునిగా చాంద్‌బాషా, యం.సత్యవతి పలువురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అరియారం సురేష్, ఆవుల వెంకటేశ్వరరావు, సీఎస్‌పురం, పామూరు, పీసీపల్లి ఎంఈఓలు పాల్గొన్నారు.


కొండపనాయుడు, వెంకటేశ్వర్లు

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

కందుకూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కందుకూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దామ కొండపనాయుడు, చిత్తారి వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు


బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు


బొడ్డు చావిడి వద్ద నాగ శిలలకు ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: కార్తీక మాస ప్రారంభం కావడంతో ఆలయాల్లో ఆదివారం కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో భవానీ శంకర స్వామికి, అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. ఆలయంలోని నాగేంద్రస్వామికి ప్రమిదుల్లో దీపాలు వెలిగించి, విశిష్ట పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మరావు, వీసీ రామశాస్త్రి, ఈర్ల గురవయ్య, ఏసీ చెంచులు, మండ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పునుగోడు శివాలయంలో, నందనమారెళ్ల ఆలయంలో తదితర గ్రామాల్లోని శివాలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో ఆలయాల్లో విశిష్ట పూజలకు ఆయా కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బొడ్డు చావిడి గశిలలకు ప్రత్యేక పూజలు

పట్టణంలోని బొడ్డు చావిడి సెంటర్‌లో గత రెండ్రోజులుగా రోడ్ల విస్తరణలో భాగంగా ఆక్రమణ తొలగింపు చర్యలను మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఈక్రమంలో పురాతన కాలం నాటి నుంచి ఉన్న నాగశిలలు వెలుగు చూశాయి. ఇప్పటి వరకు దొరువు వీధి రోడ్డు వైపు ఉన్న నాగశిలలు, శాసనాలు దుకాణాల ఏర్పాటుతో కన్పించ లేదు. తాజాగా ఆక్రమణల తొలగింపుతో నాగ శిలలు కనిపించడంతో శని, ఆదివారాల్లో మహిళలు దీపాలు వెలిగించి విశిష్ట పూజలు చేశారు. కార్తీక మాసం కావడంతో నాగశిలల పూజలకు ప్రత్యేకత సంతరించుకుంది. ఈ నెలలో వచ్చే నాగులచవితి వేడుకలను అక్కడ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

భైరవకోనలో ప్రత్యేక పూజలు


జిల్లా పోలీస్ అధికారులకు వేద ఆశీర్వచనం

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరకోనను పీటీసీ డీఎస్పీ డి.లక్ష్మణ్‌కుమార్ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మొదట త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో పూజలు చేయించారు. ఆలయ ఈఓ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు.

ఏఈ వేధింపుల నుంచి కాపాడండి

కొండపి: విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కోటయ్య వేధింపుల నుండి తమను కాపాడాలని కొండపి సబ్‌స్టేషన్ లైన్‌మన్ నాయక్, ఇతరులు మంత్రి స్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ బదిలీ విషయంలో ఇబ్బంది పెట్టి, నాకు నెల జీతం రాకుండా అడ్డుకున్నారని వాపోయారు. కొండపి లైన్‌మన్ మీరవాళి మాట్లాడుతూ చిన్న చిన్న విషయాల్లో కూడా దుర్భాషలాడుతూ మా మనోభావాలు దెబ్బతీస్తున్నారని విన్నవించారు.

బెల్టు దుకాణాలపై పోలీసుల దాడి


ఎలికవారిపల్లిలో బెల్ట్‌షాపులు తనిఖీ చేస్తున్న ఎస్సై


జి.అగ్రహారంలో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మర్రిపూడి: మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ జి.అగ్రహారంలో బెల్టు దుకాణాలపై ఎస్సై రమేష్ బాబు ఆధ్వర్యంలో దాడి చేశారు. దాడిలో 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హనుమంతునిపాడు: గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎం మాధవరావు హెచ్చరించారు. మండలంలోని ఎలికవారిపల్లి, హనుమంతునిపాడు, రెడ్డెంవారిపల్లి గ్రామాల్లో ఎస్సై తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా బెల్టుషాపులు నిర్వహిస్తే జైలుకు పోక తప్పదని గతంలో దుకాణాలు నిర్వహించిన వారిని హెచ్చరించారు. మద్యం తాగి గ్రామాల్లో, బస్టాండ్ సెంటర్లలో అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. మద్యం షాపులో బార్లు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు.

సాలిపేట నిర్వాసితులకు

నష్టపరిహారం చెల్లించాలి

- పోర్టు నిర్వాసితుల సంక్షేమ సంఘం డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న జి.వెంకటేశ్వర్లు

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు పరిధిలోని సాలిపేట బీసీ కాలనీ వాసులకు నష్టపరిహారం చెల్లించాలని రామాయపట్నం పోర్టు నిర్వాసితుల సంక్షేమ సంఘం కన్వీనర్ జి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సాలిపేటలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాలిపేట పంచాయతీలోని కర్లపాలెం, సాలిపేట ఎస్టీ కాలనీ, బీసీ కాలనీలను పోర్టు కోసం సర్వే చేశారని, కర్లపాలెం, సాలిపేట ఎస్టీ కాలనీకు ఇళ్ల ప్యాకేజీ ఇచ్చారని తెలిపారు. సర్వే చేసినప్పుడు కూడా బీసీలకు మాత్రం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు. వెంటనే బీసీ కాలనీకి కూడా ఎఫెక్ట్ గ్రామం కింద మంజూరు చేసి ఇండ్ల ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మా భూములు పరిశ్రమల కోసం తీసుకుంటున్నారు, మా చుట్టుపక్కల గ్రామాల భూములు కూడా పరిశ్రమలకు తీసుకుంటున్నారు. భూములు లేకుండా ఇక్కడ మేము నివాసం ఉండడం వల్ల మాకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందన్నారు. 55 ఎకరాలు పంట పండే నీటి కుంటను మా అనుమతి లేకుండానే పూడ్చివేశారని, దీని వల్ల బీడు భూములుగా మారిపోతాయాయన్నారు. పోర్టు నిర్మాణం వల్ల దుమ్ము దూళి శబ్ద కాలుష్యం ఏర్పడి రోగాల బారిన పడే అవకాశాలున్నాయని వాపోయారు. మా కష్టాలను దృష్టిలో పెట్టుకొని ఇళ్ల ప్యాకేజీ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సాలిపేట గ్రామస్తులు సన్నిబోయిన రామ్మోహన్, కొక్కిలిగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీరామ్మూర్తి, బండారు రామారావు, రామ్మోహన్ రావు, కోమరిక కోటయ్య, చల్లా వేణుస్వామి, మునగాల మాధవ్, సుధాకర్, రవి, వాసు దేవరావు, రమేష్, బాలాజీ, కృష్ణ ఉదయభాస్కర్, వీరనారాయణ పాల్గొన్నారు.

నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు

టంగుటూరు: రాగాయకుంట 26 ఎకరాలను చెరువుగా మార్చి టంగుటూరు గ్రామానికి మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. టంగుటూరు సీపీఎం ఏరియా టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను సీనియర్ నాయకుడు తన్నీరు సుబ్బారావు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ టంగుటూరు గ్రామస్తులు మంచినీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. పాలేరు, ముసీ వాగుల నుంచి నీరు సముద్రంలోకి వృథాగా పోతున్నా టంగుటూరుకు శాశ్వత మంచినీటి వసతిని ఏర్పాటు చేసుకోలేకపోవడం పాలకుల నిర్లక్ష్యమన్నారు. రాగాయకుంట 26 ఎకరాలను చెరువుగా మార్చి పాలేరు, ముసీ ఏర్ల నుంచి నీటిని లిఫ్ట్ చేసి పంపుల ద్వారా చెరువును నింపితే టంగుటూరుకి ఉన్న మంచినీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్న టంగుటూరు ప్రజలకు విముక్తి కలగాలంటే సెంటర్‌లో ఉన్న రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. టంగుటూరులోని కొత్త కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లెలమూడి ప్రాజెక్టు వద్ద మేటవేసిన ఇసుకను తొలగించడం వల్ల జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల్లో చెరువులకు నీళ్లు వచ్చి సాగు, తాగునీటి సమస్య పరిష్కారమవుతుందనితెలిపారు. సమస్యల పరిష్కారంపై సీపీఎం ఎనలేని పోరాటం చేస్తుందన్నారు. అనంతరం సీపీఎం ఏరియా కమిటీని ఐదుగురు సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.రాము, సభ్యులుగా వి.మోజెస్, టి వెంకటరావు, వి.సింగయ్య, షేక్ మీరాస్ ఎంపిక చేశారు. సీపీఎం జిల్లా నాయకులు కె.ఆంజనేయులు, జి.శ్రీనివాసులు, వి.బాలకోటయ్య, పి.రవికుమార్, బి.శివయ్య, జి.సాల్మన్ పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు

కందుకూరు రూరల్: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు అన్నారు. కందుకూరులోని దాచూరి రామిరెడ్డి విజ్ఞాన్ భవన్‌లో యూటీఎఫ్ కందుకూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు మండల శాఖల నూతన కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు అధ్యయనాన్ని పెంచుకొని ప్రభుత్వ ప్రజా విద్యారంగ వ్యతిక విధానాలను తిప్పకొట్టాలని పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా గౌరవ అధ్యక్షుడు టి.కేశవరాజు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలమన్నారు. అనంతరం కందుకూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు మండలాల నూతన కార్యవర్గాలను ఎంపిక చేశారు. జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు టి.నారాయణరావు, ఎం.కోటేశ్వరరావు, మండలాల అధ్యక్ష, కార్యదర్శలు రహంతుల్లా, మన్నం మాధవరావు, ఎం.హనుమంతరావు, గొట్టిపాటి మాధవరావు, మక్కెన రమేష్‌బాబు, సాలి సూర్యనారాయణ, ఎస్.జాలయ్య, ప్రాంతీయ మండలాల కార్యకర్తలు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అభిషేకోత్సవం, గోపూజ


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అభిషేకోత్సవం, మహానివేదన, గోపూజ అర్చకులు మంకాల శివప్రసాద్ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా నారాయణ స్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళ తాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, బి.జయరామిరెడ్డి, హనుమంతు, డోలా శ్రీనివాసులు, తిరుపతయ్య, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన మినీ ట్రక్

ఉలవపాడు: రోడ్డు మలుపు తిరుగుతున్న ద్విచక్రవాహనాన్ని మినీ ట్రక్కు ఢీకొనడంతో ద్విచక్రవాహనదారునికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జాతీయరహదారిపై ఉలవపాడు ఉత్తరబైపాస్ జంక్షన్ వద్ద ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే. ఉలవపాడుకు చెందిన కల్లయ్య తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్లేందుకు మలుపు తీసుకుంటున్న సమయంలో రేపల్లె నుంచి శ్రీకాళహస్తికి అరటికాయల లోడుతో వెళుతున్న మినీ ట్రక్కు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. మినీ ట్రక్కు డ్రైవర్ అప్రమత్తంగా ఉండి రోడ్డు డివైడర్ మీదకు తిప్పడంతో గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రున్ని 108 సిబ్బంది ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన మినీ ట్రక్కు.

పీసీపల్లిని వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలి

పీసీపల్లి: పీసీపల్లి మండలాన్ని వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి చేర్చి రైతాంగాన్ని కిడ్నీ బాధితులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం పీసీపల్లిలో సమావేశం నిర్వహించారు. పి.మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా జన విజ్ఞాన వేదిక నాయకుడు కరణం గంగయ్య, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నరసింహారెడ్డి పాల్గొన్నారు. పీసీపల్లి మండలంలోని భూగర్భ జలాల్లో ప్రమాదకరమైన విష రసాయనాలు ఉన్నాయని, ఆ నీటిని తాగడం వల్ల వందలాది మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. విస్తారమైన భూములు ఉన్నా శాశ్వత సాగునీటి సౌకర్యం లేక వేలక ఎకరాల భూములు బీడు భూములుగా ఉన్నాయని తెలిపారు. మండలం మొత్తం చిన్నా పెద్దవి 25 చెరువులు ఉన్నా ఏటా రెండు మూడు చెరువులు కూడా నిండటం లేదన్నారు. ప్రధానంగా ఎక్కువ ఆయకట్టు కలిగిన మారెళ్ల, పెద యిర్లపాడు, నేరేడుపల్లి, పీసీపల్లి లాంటి చెరువులు దశాబ్ద కాలంగా నిండటం లేదన్నారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు మేడం చిన బ్రహ్మారెడ్డి, నాయకులు నారపరెడ్డి, మాల కొండయ్య, ఇమ్మానియేలు, వేమూరి శ్రీను, వీరపనేని శ్రీరాములు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం

సింగరాయకొండ: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు మహిళలు కనిపించడం లేదని ఆదివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదైనట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. సుందర్‌నగర్‌కు చెందిన పోట్లూరి రేణుక(20) ఈనెల 1వ తేది శుక్రవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని, బంధువులను విచారించినా ఆచూకీ తెలియలేదని భర్త శ్రీహరి ఫిర్యాదు చేశారు. మరొక కేసులో ఆంజనేయనగర్‌కు చెందిన బండి విమలమ్మ(52) శనివారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిందని, తిరిగి రాకపోవటంతో ఆమె కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భక్తిశ్రద్ధలతో అంకాళమ్మ తిరునాళ్ల

పామూరు: పామూరులో గ్రామ దేవత అంకాళమ్మ తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంకాళమ్మ మూల విగ్రహమూర్తికి అర్చకులు విశిష్ట పూజలు, పంచామృతాభిషేకం చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఓగూరి ఏడుకొండలు, నరసింహారావు, ఇర్రి వెంకటరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

కనిగిరి రూరల్: సోషల్ మీడియా వేదికగా ఓ సామాజిక వర్గంపై వివాదాస్పద, అసభ్యకర, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు. పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ, తొలగింపులకు సంబంధించిన స్థానిక ఎన్జీఓ కాలనీకి చెందిన ఎస్‌కే అష్రఫుల్లా అనే యువకుడు ఓ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతినేలాసోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టాడు. దీనిపై ఆ సామాజిక వర్గానికి చెందిన వారు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో యువకుడు అష్రఫుల్‌పై ఐటీ యాక్ట్ ప్రకారం, మూడు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి సీఐ ఎస్‌కే ఖాజావలి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా మతాలు, కులాలు, వర్గాల మనోభావాలను కించపరిచేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

సీఎస్‌పురం(పామూరు): ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ ఖాదర్‌బీ తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల, పీఎస్‌లు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.